క్లుప్తంగా

నేడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

నాగులుప్పలపాడు: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను శనివారం ఉదయం 10 గంటలకు నాగులుప్పలపాడు మండలంలోని వినోదరాయునిపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ తెలిపారు. అందరూ పాల్గొనాలని కోరారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

మద్దిపాడు: వినాయకచవితి సందర్భంగా మండలంలో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకుని ఉండాలని ఎస్‌ఐ శివరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మండపాలు ఏర్పాటు చేయాలనుకున్న వారు ఆ వెబ్‌సైట్‌లో సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చని చెప్పారు. అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

నిర్వాహకులు ముందుగా పోలీస్ శాఖ, గ్రామ రెవెన్యూ, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకోవాలని సూచించారు. మండపాలలో రాత్రి పది గంటలు దాటిన తర్వాత డీజే సిస్టం వినియోగించరాదని తెలిపారు. ముఖ్యంగా గ్రామాలలో రహదారులపై విగ్రహాలు ఏర్పాటు చేయరాదన్నారు. అసభ్యకరమైన డ్యాన్సులు చేయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిమాపక యంత్రాలు కలిగి ఉండాలని, ఎవరైనా అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. నిర్వాహకులు రాత్రి సమయంలో మండపాల వద్ద పడుకోవాలన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేస్తే వెంటనే 112కి ఫోన్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో సమీపంలో బాణసంచా కాల్చరాదని తెలిపారు. వివాదాలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో వినాయకచవితి నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపు

మద్దిపాడు: సీఎం చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడదామని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మద్దిపాడు మండలంలోని కీర్తిపాడు, నాగన్నపాలెం, లింగంగుంట, కొష్టాల సెంటర్ల వద్ద శుక్రవారం సాయంత్రం బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే నిలువెల్లా మోసమని, ఆయన చెప్పే మాటలకి.. చేసే పనులకు సంబంధం ఉండదని విమర్శించారు. చెప్పిన పనులు చేయకపోవడంతో పాటు తాను చేసే తప్పుడు పనులు చెప్పకపోవడం చంద్రబాబు నైజమని అన్నారు. చంద్రబాబుకు నిజం చెప్తే తల పగిలిపోతుందనే శాపం ఉందని, అందుకే ఆయన నిజాలు చెప్పలేరని ఎద్దేవా చేశారు. ఈ మాటను అప్పట్లోనే దివంగత సీఎం వైఎస్సార్ చెప్పారని గుర్తు చేశారు. చంద్రబాబు అంటేనే మోసమని పిల్లనిచ్చిన మామ ఎన్టీ రామారావు కూడా చెప్పారన్నారు. పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన ఘనుడు.. రాష్ట్రానికి వెన్నుపోటు పొడవడం పెద్ద లెక్క కాదన్నారు. ప్రజలను మోసం చేయడంలో ఆయన పీహెచ్‌డీ చేశారన్నారు. ప్రతి వ్యక్తికి ఒక్కొక్క వ్యక్తిత్వం ఉంటుందని, చంద్రబాబు మోసం చేయడమే వ్యక్తిత్వంగా మార్చుకున్నాడని అన్నారు. చంద్రబాబు మోసాలను ప్రతి వ్యక్తి గుర్తించేందుకు గత ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన హామీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్లు స్కాన్ చేసుకోవాలని ప్రజలకు మేరుగు నాగార్జున సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాయకులు మండవ బాలచంద్రమౌళి, పైడిపాటి వెంకటరావు, కంకణాల సురేష్, రాయపాటి విల్సన్, నాదెండ్ల మహేష్, తిప్పారెడ్డి కోటిరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


కీర్తిపాడులో వైఎస్సార్ సీపీ నాయకులతో మాజీ మంత్రి మేరుగు నాగార్జున

వైఎస్సార్ సీపీ ఏలూరివారిపాలెం గ్రామ కమిటీ ఎంపిక...

చీమకుర్తి రూరల్: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి మేరుగు నాగార్జున, చీమకుర్తి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏలూరివారిపాలెం గ్రామ కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షునిగా ఏలూరి సుబ్బారావు, ఉపాధ్యక్షునిగా ఏలూరి మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా బి.రమేష్, పి.చిన్న కోటేష్, బూత్ కన్వీనర్‌గా బి.ఎహోషువ, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా జి.చినకోటయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా చెన్నకేశవులు, బీసీ సెల్ అధ్యక్షునిగా ఎ.శ్రీకాంత్, యూత్ విభాగం అధ్యక్షురాలిగా లక్ష్మి, రైతు విభాగం అధ్యక్షునిగా కిలారి శ్రీకాంత్, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా ఆనాల శ్యామ్, సేవాదళ్ అధ్యక్షునిగా బి.కోటేశ్వరరావు, కార్యదర్శులుగా ప్రసాద్, అంజయ్య, కోటేసు, వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా డేవిడ్, అంకమ్మరావు, శేఖర్, రవి, కోటయ్య నియమితులయ్యారు. గురువారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీలక్ష్మి సురేస్, రైతు విభాగం అధ్యక్షుడు నల్లూరి చంద్ర, నాయకులు మక్కెన రాజేంద్ర, పిచ్చయ్య, హరిప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతి శిక్షణ తరగతుల బహిష్కరణ

కొత్తపట్నం: గ్రామ పంచాయతీల పురోగతిపై మండలాల వారీగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను కొత్తపట్నం మండలంలో బహిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించగా, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బహిష్కరించారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నిధులు వెనక్కు వెళ్లినా పరవాలేదని, అర్హులకు మాత్రం పథకాలు ఇవ్వడం లేదని అన్నారు. కూటమి నాయకులు చెప్పినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మండలంలో 65 మంది వికలాంగులకు పింఛన్లు తొలగించారన్నారు.


కొత్తపట్నంలో మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

100 శాతం వికలత్వం ఉన్నప్పటికీ తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ విచారించి వారికి పింఛన్లు ఇవ్వాలని ఎంపీడీవోకు సూచించారు. మూగజీవాలకు తాగునీటి తొట్లు కడితే.. ఒక్క తొట్టిలో కూడా నీరు లేదన్నారు. కనీసం కుళాయి కనెక్షన్ కూడా ఇవ్వలేదన్నారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న వారిని అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, కూటమి నాయకులకు మాత్రం కొమ్ముకాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రజల ఆస్తులు కాపాడాల్సిన అధికారులు కూటమి నాయకులకు బానిసలుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలకు ఉపయోగపడే రోడ్డుపై గోడ కడితే.. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు మాట్లాడుతూ సర్పంచ్‌లు పంచాయతీ పురోగతి గురించి మాట్లాడితే పట్టించుకోకుండా ఎమ్మెల్యే, కూటమి నాయకులు చెప్పినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. అందువలన శిక్షణ కార్యక్రమాన్ని బహిష్కరించి వెళ్లిపోతున్నట్లు ప్రకటించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలి

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్రమైన ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌కు సామాన్యులు ఎక్కువగా వస్తుంటారని, ప్రయాణికుల కోసం ఉచితంగా వాహన పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సీపీఎం నగర కమిటీ కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బస్టాండు ఆవరణలో వాహనాలు నిలుపుకునే సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ప్రహరీ వద్ద పార్కింగ్ చేసుకుంటున్నారన్నారు. అయితే, ఆ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. కోర్టులకు వెళ్తే జరిమానాలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండు వద్దకు రావాలంటే భయపడిపోయే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఉచిత బస్సు పథకానికి అనుగుణంగా ఆర్టీసీ బస్టాండులో సౌకర్యాలు కూడా పెంచాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్టాండు స్థలం ఆక్రమణపై డీఎం ఫిర్యాదు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండు స్థలం ఆక్రమణపై సంతనూతలపాడు తహసీల్దార్ నారాయణరెడ్డికి ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్.. స్థానిక వీఆర్‌ఓ వెంకటస్వామి, ఆర్టీసీ అధికారులతో కలిసి సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాన్ని పరిశీలించారు. సర్వే నిర్వహించి ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ స్థలాన్ని గ్రంధి కుటుంబీకులు ఆర్టీసీ బస్టాండుకు లీజుకిచ్చారని, ఆర్టీసీ బస్టాండు లీజు పద్ధతిలో నడుస్తోందని తెలిపారు. పరిశీలనలో అసిస్టెంట్ మేనేజర్ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్టాండు స్థలం ఆక్రమణపై ఎస్‌ఎన్ పాడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఒంగోలు డీఎం శ్రీనివాసరావు

క్విస్ కాలేజీలో విద్యార్థుల రక్తదానం

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఒంగోలు రిమ్స్ బ్లడ్ బ్యాంక్, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, క్విస్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించగా, 110 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి పాల్గొని మాట్లాడారు. రక్తదానం చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. దాది ప్రకాశమణి 18వ వర్ధంతి సందర్భంగా భారతదేశం, నేపాల్ రెండు దేశాల్లో కలిపి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 100 గంటలలో 2 లక్షల యూనిట్ల రక్తం సేకరిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ తెలిపారు. దాంట్లో భాగంగా క్విస్ ఇంజినీరింగ్ కళాశాల సహకారంతో ఇక్కడ కూడా శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సృష్టించే దిశగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమాన్ని కల్చరల్స్, ఎన్‌ఎస్‌ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్ పర్యవేక్షించగా, రిమ్స్ డాక్టర్లు వినీల, రేవతి, మాధవి, బ్రహ్మకుమారీస్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న క్విస్ కళాశాల విద్యార్థులు

వాటర్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రూపొందించాలి

- వ్యవసాయ శాఖ అనుబంధ విభాగాల సమీక్షలో కలెక్టర్

ఒంగోలు సబర్బన్: గ్రామ స్థాయిలో వాటర్ మేనేజ్మెంట్ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ అనుబంధ విభాగాలైన భూగర్భ, జల వనరుల శాఖ, డ్వామా, మైక్రో ఇరిగేషన్, ఉద్యాన శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలమట్టం మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖల అధికారులను, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సమన్వయం చేసుకొని 20 మీటర్ల కంటే ఎక్కువ భూగర్భ జలమట్టం ఉన్న గ్రామాల్లో, 8 నుంచి 20 మీటర్ల లోపు భూగర్భ జలమట్టం ఉన్న గ్రామాల్లో ఏ ఏ చర్యలు చేపడితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందో పరిశీలించి వాటర్ మేనేజ్మెంట్ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ ఎస్.శ్రీనివాసరావు, జల వనరుల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఎస్.ఈలు వరలక్ష్మి, బాల శంకర రావు, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాస రావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


వ్యవసాయ అనుబంధ శాఖల సమీక్షలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా


కొప్పోలు చెన్నకేశవస్వామి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు


శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

ఒంగోలు మెట్రో:

శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు అమ్మవారి ఆలయాలలో అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. ఒంగోలులోని లాయర్‌పేట షిర్డీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారికి శిద్దా లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితులు నేలబొట్ల రామకృష్ణ పూజలు చేశారు. శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు పాల్గొని వరలక్ష్మీ వ్రతం జరిపించారు. ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వేద పండితులు పొదిలి భానుప్రకాశశర్మ, శనగవరపు రవితేజ భక్తులచే శాస్త్రోక్తంగా వరలక్ష్మీ పూజ, కుంకుమార్చన నిర్వహించారు. శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

చెన్నకేశవస్వామి దేవస్థానంలో...

కొప్పోలులోని చెన్నకేశవస్వామి ఆలయంలో కొలువై ఉన్న రాజ్యలక్ష్మీ అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశంసమీర్ 200 మంది మహిళలచే సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి, భక్తులు పాల్గొనగా, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.


ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

మాజీ మంత్రి శిద్దా నివాసంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం...

ఒంగోలు సిటీ: మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి ఆధ్వర్యంలో స్థానిక వారి నివాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. లక్ష్మీదేవిని వరలక్ష్మీదేవిగా అలంకరించి వేద పండితుడు నేలబొట్ల రామకృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులు, మన్యం సునీత, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, స్వర్ణ ఆభరణాలు, పట్టు చీర, కలువ పుష్పాలు, కదంబ పుష్పాలు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై పూజలో పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. భక్తిపాటలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులకు తీర్థప్రసాదాలు, పసుపు, కుంకుమలు అందజేశారు.


వరలక్ష్మీ వ్రతంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు

చీమకుర్తిలో...

చీమకుర్తి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి ఆశీర్వాదాలు అందుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.


చీమకుర్తి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న మహిళలు

పచ్చదనంతోనే ఆహ్లాదకరమైన పరిసరాలు

- ఏకేయూ వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిసరాలు పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంటేనే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయని వైస్ చాన్సిలర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శుక్రవారం ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో ఎన్.ఎస్.ఎస్ సమన్వయకర్త డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప కులపతి ప్రొఫెసర్ మూర్తి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి, ఫైనాన్స్ అధికారి కృష్ణారావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ మొక్కలను అధికంగా పెంచడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిస్తాయన్నారు. నగరాలు, పట్టణాలు, గ్రామాలనే తారతమ్యం లేకుండా, వయసుతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా హరితవనాలను విరివిగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఇందులో ఆంధ్రకేసరి యూనివర్సిటీ విద్యార్థులు తప్పకుండా భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటిన అనంతరం పలువురు ఎన్.ఎస్.ఎస్ వలంటీర్లకు వీసీ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆక్వాకల్చర్ విభాగం సహాయక ఆచార్యుడు డాక్టర్ బి.సురేష్, డాక్టర్ అశ్వర్థ నారాయణ, గార్డెనర్ రమేష్, బోధన, బోధనేతర సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఏకేయూ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న వీసీ మూర్తి, ప్రిన్సిపాల్, తదితరులు

భూసారానికి తగిన విధంగా పంటలు వేయాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): భూసారానికి తగిన విధంగా పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారిణి పావని సూచించారు. శుక్రవారం మండలంలోని పేర్నమిట్టలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో జి.కృష్ణ, మండల వ్యవసాయ విస్తరణాధికారులు సుబ్బారెడ్డి, జానకి, లక్ష్మీరాజ్యం, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏఓ పావని

దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్యనిర్వాహక సంచాలకుడు అర్జున్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు ఏబీఎం జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న దుకాణ సముదాయంలోని 2, 5 నంబర్ల దుకాణాలను అర్హులైన వారికి అద్దెకివ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు షెడ్యూల్డు కులాలకు చెందిన వారై ఉండాలన్నారు. నిరుద్యోగి అయి ఉండి స్వయం ఉపాధి పథకాలపై నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. కనీసం 5వ తరగతి విద్యనభ్యసించి ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను కార్యనిర్వాహక సంచాలకులు, షెడ్యూల్డు కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్, ప్రగతి భవన్ చిరునామాలో ఈ నెల 26వ తేదీలోపు అందజేయాలన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

ముదిరాజ్ మహాసభ కార్యనిర్వాహక కార్యదర్శిగా సురేష్



ఒంగోలు వన్‌టౌన్: ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పులుసు సురేష్‌బాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సురేష్‌ను పలువురు అభినందించారు.

ఉపాధ్యాయ నియామకాల్లో నూతన విధానాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయ నియామకాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానాలను ఉపసంహరించుకోవాలని, డీఎస్సీ మెరిట్ లిస్టు, జిల్లాల వారీగా కటాఫ్ ప్రకటించిన తర్వాతే సెలెక్ట్ అయిన ఫైనల్ లిస్ట్ విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఒంగోలులో డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి ఆ మేరకు వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు పి.చంద్రశేఖర్, పవన్, టి.తేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భద్రత కల్పించాలి

ఒంగోలు సబర్బన్: పాఠశాలల్లో విద్యార్థులకు బోధనతో పాటు భద్రతకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎంతమంది విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్లు లేవో గుర్తించాలని డీఈఓ కిరణ్ కుమార్‌కు సూచించారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంఈఓలు సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు.

పంచాయతీల అభివృద్ధికి దోహదపడండి

నాగులుప్పలపాడు: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో దోహదపడాలని ఎంపీడీఓ తేళ్ల రవికుమార్ కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతిపై ఎంపీటీసీలు, సర్పంచ్లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సుస్థిరత అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా గ్రామ పంచాయతీల్లో 9 అంశాలపై 556 సూచికలకు సంబంధించి వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల పురోగతిని యాప్లో నమోదు చేయాలన్నారు. అధికారులు, సచివాలయాల సిబ్బంది తగు జాగ్రత్తలు వహించి శ్రద్ధతో సమాచారం అందించడం ద్వారా దేశంలో 2.50 లక్షల గ్రామాల అభివృద్ధిని అంచనా వేయడం సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంఈఓ రవి, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.


నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మద్దిపాడులో...

మద్దిపాడు: మండలంలోని పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వి.జ్యోతి అధ్యక్షతన ఈఓపీఆర్‌డీ రఘుబాబు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలను అభివృద్ధి చేసుకునే అవకాశాలను గుర్తించాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని పంచాయతీల పనితీరు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, పురోగతిపై సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేంద్ర పాల్గొని మాట్లాడారు. వైస్ ఎంపీపీ జేష్ఠ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ అజిత, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామ పంచాయతీల అధికారులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2025-26లో గ్రామ పంచాయతీల పురోగతిపై శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీడీఓ సురేష్ పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ రమణమ్మ, వైస్ ఎంపీపీ సులోచన, మద్దినేని హరిబాబు, ఏఓ శారద, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.